www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
బుధవారం | 22 | ఏప్రిల్ | 2026 పేజీలు : 8

## కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యం



2లో..

-పోటీ పరీక్షపై దృష్టిసారించాలి
-విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి
- విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో కలెక్టర్

# ఆర్టీసిలో నేటి నుంచి సమ్మె

-స్తంభించనున్న ప్రజా రవాణా
-డిమాండ్ల సాధనే లక్ష్యంగా పోరాటం

ప్రజాపక్షం/ఖమ్మం :

ఆర్టిసిలో సమ్మె సైరన్ మోగింది. దాదాపు ఏడేళ్ల తర్వాత ఆర్టిసి సమ్మెకు కార్మికులు సిద్ధమయ్యారు. ఈ నెల 22న మొదటి షిఫ్ట్ నుంచి సమ్మె ప్రారంభమవుతుందని జేఏసి నాయకులు తెలిపారు. ఏడేళ్ల క్రితం ఏ డిమాండ్స్‌తో సమ్మె ప్రారంభమైందో అవే డిమాండ్స్‌తో మరల ఇప్పుడు సమ్మె జరుగుతుందంటే ప్రభుత్వాలు మారినా సమస్య పరిష్కారం కాకపోవడమే సమ్మెకు కారణమవుతుంది. అప్పటి కేసిఆర్ ప్రభుత్వం విలీనాన్ని వాయిదా వేస్తూ వచ్చింది. 52 రోజుల పాటు 2019లో జరిగిన సమ్మె సమస్యలకు పరిష్కారం చూపకపోగా యాజమాన్యం అప్పటి ప్రభుత్వం తీవ్ర మొండి వైఖరితో వ్యవహరించింది. ఇందుకు ప్రతిఫలంగా 2023లో ఎన్నికల ఫలితాలు వచ్చాయన్నది అందరికీ తెలిసిన విషయమే. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి మరల పునరావృతమైంది. ఆర్టిసి కార్మికులు ప్రధానంగా ఆరు డిమాండ్లను ప్రభుత్వం మిగతా 2లో..










-గుడి ఎదుట,
బడి పక్కన, ఎక్కడ పడితే అక్కడే..
-పెరిగిపోయిన బెల్ట్ దోపిడీ
-బ్రాండ్స్ అన్నీ అక్కడే..
-సామాన్యుల జేబులకు చిల్లు
-సీసాకు
రూ. 30 నుండి 50 అదనం
-మద్దతిస్తున్న ఎక్సైజ్ శాఖ
-ప్రోత్సహిస్తున్న మద్యం మాఫియా

## నో టెండర్స్.. నో లాటరీ..
# ఓన్లీ బెల్ట్ షాప్..!



ప్రజాపక్షం/సత్తుపల్లి :
టెండర్‌కు లక్షలు అవసరం లేదు. లాటరీలో అదృష్టం కలసి రావాల్సిన పని లేదు. నో టెండర్స్, నో లాటరీ, ఓన్లీ బెల్ట్ షాప్. గ్రామీణ ప్రాంతాలను దాటి పూర్తిగా పట్టణంలో విస్తరిస్తున్న అక్రమ మద్యం విక్రయాల వలయం. రాష్ట్రంలో మద్యం విక్రయాలపై ప్రభుత్వం కట్టుదిట్టమైన నియంత్రణలు అమలు చేస్తున్నదని మిగతా 2లో..

## మక్క రైతుల కష్టాలు
# వర్ణనాతీతం..!



-గోనె సంచులు కరువు
-ఆగిన రవాణా
-కొనుగోలు కేంద్రాల కోసం రైతుల ఆందోళన

ప్రజాపక్షం/ఖమ్మం : తెలంగాణ రాష్ట్రంలోనే మొక్కజొన్న సాగు అధికంగా చేసే జిల్లాలో ఖమ్మం జిల్లా ఒకటి. ఈ ఏడాది రబీ సీజన్‌లో మక్క సాగు చేసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, గోనె సంచుల సరఫరా, ఎగుమతుల విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొనుగోలు కేంద్రాల కోసం పెద్ద ఎత్తున రైతులు మిగతా 2లో..



# ఆర్టీసిలో నేటి నుంచి సమ్మె

(మొదటిపేజీ తరువాయి)

ముందు ఉంచుతున్నారు. 32 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చిన ఇందులో ఆరు మాత్రం ప్రభుత్వ పరిధిలో ఉండగా మిగిలిన 26 డిమాండ్లను పరిష్కరించాల్సింది యజమాన్యమే. మొదటి డిమాండ్‌గా ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతున్నారు. ఇది గతంలో పలుమార్లు చర్చకు వచ్చిన అంశమే. రెండవది 2013 పిఆర్‌సి బకాయిల చెల్లింపు. నూతన పిఆర్‌సి అమలు వీటితో పాటు ఆర్టీసిని ఆధునీకరిస్తామని ఆర్టీసిల ఆధునీకరణ కూడా ప్రధానమైంది. పిసిసి అధ్యక్షునిగా ఎన్నికలకు ముందు ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్టీసి విలీనంపై, పిఆర్‌సి చెల్లింపులు, ఆర్టీసి ఆధునీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వడంతో పాటు వేల మంది కార్మికులు ఉన్న ఆర్టీసిలో యూనియన్లను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందులో ఏ ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోలేదు. ఆర్థిక పరమైన అంశాల విషయంలో కానీ, ఇతర విషయాల్లో కానీ ప్రభుత్వం చొరవ చేయడం లేదు. ప్రస్తుత రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తాను కార్మిక నాయకున్నే అని చెప్పడం తప్ప చేసింది శూన్యమని కార్మికులు ఆరోపిస్తున్నారు. మొట్టమొదటి సారిగా ఆర్టీసిలో తెలంగాణ ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ నేతృత్వంలో జేఏసిగా ఏర్పడి పలు మార్లు ప్రభుత్వం ముందు తమ డిమాండ్లను ఉంచారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 22 నుంచి సమ్మె చేస్తున్నట్లు నోటీసు ఇచ్చారు. ఈ సమ్మెకు జేఏసితో పాటు ఆర్టీసిలో ఉన్న అన్ని సంఘాలు మద్దతు ప్రకటించాయి.

**రిటైర్‌మెంట్లే కానీ...**

దశాబ్ద కాలంగా ఆర్టీసిలో రిటైర్‌మెంట్లే కానీ రిక్రూట్‌మెంట్లు లేవు. 18వేల మంది ఆర్టీసి కార్మికులు ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో ఉద్యోగులను నియమించ లేదు. దీనికి తోడు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సిబ్బంది పాలిట శాపంగా మారింది. బస్సుల సంఖ్య పెరగకపోవడం, సిబ్బంది నియామకం జరగకపోవడంతో ఉన్న సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న సిబ్బందితో 10 నుంచి 16 గంటలు పని చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తమవుతుంది. లక్షల్లో ప్రయాణికులు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణించారని చెబుతున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా సిబ్బంది నియామకం ఎందుకు చేయడం లేదని ఆర్టీసి కార్మికులు ప్రశ్నిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కడంతో సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే బస్సుల సంఖ్యను పెంచాలని, సిబ్బందిని నియమించాలని చాలా కాలంగా చేస్తున్న డిమాండ్ పరిష్కారానికి నోచుకోకపోవడమే సమ్మెకు కారణమైంది. మరో పక్క ఆర్టీసిని ప్రైవేటు పరం కానివ్వబోమని చెప్పిన రేవంత్‌రెడ్డి ఎలక్ట్రిక్ బస్సుల స్థానంలో కొన్ని డిపోలను ప్రైవేటీకరించే పనిలో పూనుకోవడం కూడా కార్మికుల ఆగ్రహానికి, సమ్మెకు కారణమవుతుంది.

**ఖమ్మం రీజియన్‌లో...**

ఖమ్మం రీజియన్‌లో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లందు, భద్రాచలం, మణుగూరు డిపోలు ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో 366 ఆర్టీసి బస్సులు ఉండగా 226 అద్దె బస్సులు ఉన్నాయి. 1523 మంది కార్మికులు 432 మంది ఇతర సిబ్బంది పనిచేస్తున్నారు. రేపు ఉదయం సమ్మెలో పాల్గొనున్నట్లు అన్ని సంఘాలు ప్రకటించడంతో ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించనుంది. కడపటి సమాచారం అందే వరకు సచివాలయంలో జేఏసి నేతలతో ప్రభుత్వం చర్చలు జరుపుతుంది.

# కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఇంటర్ పరీక్షల్లో కష్టపడి పనిచేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చిన ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్‌దురిశెట్టి మాట్లాడుతూ తనకు చిన్నతనంలో ప్రత్యేకమైన కలలు, ఆత్మ విశ్వాసం లేవని ఇంటర్ ఫలితాలు తనలో నమ్మకాన్ని పెంచాయని కలెక్టర్ తెలిపారు. కష్టపడి పనిచేస్తే ఏదైనా సాధించగలమన్న విశ్వాసం కలుగుతుందన్నారు. ప్రస్తుతం మంచి మార్కులు సాధించిన ప్రతి విద్యార్థిలో ప్రతిభా మేధస్సు ఉన్నాయని వాటిని పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇంతటితో ఆగకుండా ఇంకా ఉన్నత లక్ష్యాలు సాధించేందుకు కృషి చేయాలని, మంచి కళాశాలలో సీటు పొందేందుకు పోటీ పరీక్షలపై దృష్టిసారించాలని తెలిపారు. విజయం సాధించిన వారిలో మేధస్సు, మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు, కష్టపడే స్వభావం అనే మూడు ముఖ్య లక్షణాలు కనిపిస్తాయన్నారు. జీవితంలో అవకాశాలు ఎప్పుడు ఉంటాయని ఒక అవకాశం కోల్పోయిన మరో అవకాశం వస్తుందని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వలన విద్యను నేర్చుకోవడం సులభమైందని సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఇంటర్‌నెట్‌ను సానుకూలంగా వినియోగిస్తూ కొత్త విషయాలను నేర్చుకోవాలని ప్రపంచంలో జరుగుతున్న మార్పులను నిరంతరం తెలుసుకుంటూ ఉండాలన్నారు. విద్యార్థులు పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని, చదివిన విషయాలను రాసుకునే అలవాటు చేసుకోవాలన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులను కలెక్టర్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి కె. రవిబాబు, కెజిబివి సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, బిసి వెల్ఫేర్, ఆర్‌జెసి స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్, అంబేద్కర్ కళాశాల, మోడల్ కాలేజీ ఎస్‌వోలు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# మక్క రైతుల కష్టాలు వర్ణణాతీతం.!

(మొదటిపేజీ తరువాయి)

ఆందోళనలు చేస్తున్నారు. గతేడాది మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్నల కొనుగోలు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది మొక్కజొన్నల కొనుగోలులో ఎందుకో ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రైవేటు వ్యాపారులు వీలైనంత మేర దండుకున్నారు. ప్రభుత్వం మొక్కజొన్న పంటకు క్వింటా రూ.2,400 మద్దతు ధర నిర్ణయించగా కొనుగోలు కేంద్రాలు ఆలస్యం కావడం, అధికార యంత్రాంగం సరైన రీతిలో స్పందించకపోవడంతో 25 శాతం మంది రైతులు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రైవేటు వ్యాపారులు రూ. 1400 నుంచి రూ. 1600ల చొప్పున మాత్రమే కొనుగోలు చేశారు. దీనితో రైతుకు క్వింటాకు రూ. 800 చొప్పున నష్టపోవాల్సి వచ్చింది. ఎట్టకేలకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్న ప్రభుత్వం మొక్కజొన్న సాగు విస్తీర్ణం, దిగుబడికి అనుగుణంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదు. అత్యధికంగా మొక్కజొన్న పండించే ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు లేక రైతులు రోడ్డెక్కారు. చాలా ప్రాంతాల్లో రైతుల ఆందోళనతో ప్రభుత్వం దిగిరాక తప్పని పరిస్థితి ఏర్పడింది. బోనకల్ మండలంలో సోమవారం రైతులు రోడ్డెక్కడంతో మంగళవారం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం పెట్టిన నిబంధనలు కూడా రైతుల పాలిట శాపంగా మారింది. ఈ ఏడాది మొక్కజొన్న దిగుబడి ఆశాజనకంగా ఉంది. ఎకరానికి 30 నుంచి 40 క్వింటాళ్ల మధ్య దిగుబడి రాక ప్రభుత్వం మాత్రం ఎకరానికి 26 క్వింటాళ్ల చొప్పున మాత్రమే కొనుగోలు చేస్తామన్న నిబంధనతో రైతులు పండించిన మొక్కజొన్నలను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నిబంధనను తక్షణం ఎత్తివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలకు గోనె సంచులు రావడం లేదు. ప్రభుత్వ యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లలో వైఫల్యం చెందిన కారణంగానే గోనె సంచుల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు చేరిన మొక్కజొన్నలను రోజుల తరబడి ఉంచినా గోనె సంచులు లేక కాంటాలు వేయడం లేదు. ఒక్కోసారి రైతులు వారం రోజుల పాటు మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది. తీరా కాంటాలు వేస్తే రవాణా సౌకర్యం లేదు. మీరే రవాణా చేయండి దూరాన్ని బట్టి డబ్బులు చెల్లిస్తామంటూ అధికారులు రైతులను ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. దూరాన్ని బట్టి ఎగుమతి ఛార్జీలు ఇస్తామని అంటున్నారు. రైతులు నిస్సాయ స్థితిలో ఉండడంతో కల్లాల్లోనే రోజుల తరబడి ఉంటున్నారు. పరిస్థితి ఇలా ఉంటే మరో పక్క వాతావరణ పరిస్థితులు భయపెడుతున్నాయి. సాయంత్రానికి వాతావరణం మేఘావృతమై గాలి దుమారాలు వస్తుండడంతో పండించిన పంట వాన పాలు అవుతుందేమోనని మరో పక్క ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా మక్కల కొనుగోలు విషయంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు రైతులను తీవ్ర ఇబ్బందులపాలు చేస్తుంది. కొనుగోళ్లను వేగవంతం చేయడంతో పాటు గోనె సంచుల సరఫరాను పెంచి తక్షణం ఎగుమతులు జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఇప్పటికే ఆందోళన బాట పట్టిన రైతులు తగు రీతిలో స్పందించకపోతే మరింత ఆందోళన చేపట్టి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది.

# కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డిఎం



**ప్రజాపక్షం/చింతకాని :** చింతకాని మండలం నాగులవంచ, చింతకాని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలని మంగళవారం మార్క్‌ఫెడ్ డీఎం శ్యామ్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా శ్యామ్ కుమార్ రైతులతో మాట్లాడుతూ లారీల సంఖ్యను పెంచి స్టాక్‌ను త్వరలోనే పూర్తిగా తరలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి రైతుల సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. కాటాలు పూర్తయిన బస్తాలను వెంటనే తరలించాలని, కొనుగోలు పై ఉన్న 26.5 క్వింటాళ్ల పరిమితిని పెంచాలని , బస్తాల కొరతను తీర్చాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో డీసీవో గంగాధర్, సహకార సంఘం ప్రత్యేకాధికారి సుధీర్‌కుమార్, ఏడీఏ విజయచందర్, ఏవో మానస, నాగులవంచ, చింతకాని సిఈవోలు యాలముడి శ్రీనివాసరావు, మారగాని శ్రీనివాసరావు, ఏఈవో కళ్యాణి సహకారసంఘం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.


# ఏఎస్ఐలకు ఉత్తమ సేవా పథకం ప్రదానం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐలు జి. ప్రతాప్ రెడ్డి, టి. ప్రసాదరావులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేసిన కాలంలో అందించిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ఉత్తమ సేవా పథకాన్ని మంజూరు చేసింది. ఈ పథకాలను మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తన చేతుల మీదుగా ఇరువురు ఏఎస్ఐలకు అందజేశారు.సేవా పథకం అందుకున్న ఏఎస్ఐలను సత్తుపల్లి ఇన్‌స్పెక్టర్ టి. శ్రీహరి, ఎస్ఐలు ఎస్. వీరప్రసాద్, పి. ప్రదీప్, జి. అశోక్ కుమార్, ఏఎస్ఐ ఎస్. నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ ఎన్. శ్రీనివాసరావు, సిబ్బంది అభినందించారు.

# నో టెండర్స్.. నో లాటరీ.. ఓన్లీ బెల్ట్ షాప్..!

(మొదటిపేజీ తరువాయి)



అధికార ప్రకటనలు చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. అధికారికంగా టెండర్లు, లాటరీల ద్వారా లైసెన్సులు ఇవ్వకపోయినా, గ్రామాల నుంచి పట్టణాల వరకు "బెల్ట్ షాపులు" అనే అనధికార మద్యం విక్రయ కేంద్రాలు రోజు, రోజుకు పెరుగుతున్నాయి.

**పెరిగిపోతున్న బెల్ట్ దోపిడీ...**

గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులు అనేవి కొత్త విషయం కావు. అయితే ఇటీవల కాలంలో ఇవి అనూహ్యంగా పెరిగాయి. అధికారిక మద్యం దుకాణాల సమయం ముగిసిన తర్వాత కూడా, ఈ బెల్ట్ షాపుల్లో మద్యం అందుబాటులో ఉండటం వల్ల వినియోగదారులు వీటి వైపు మళ్లుతున్నారు. దీనివల్ల అక్రమ విక్రయాలు భారీగా పెరుగుతున్నాయి.బ్రాండ్స్ అన్నీ అక్కడే ధరలు మాత్రం ఎక్కువేబెల్ట్ షాపుల్లో సాధారణంగా ప్రభుత్వ దుకాణాల్లో లభించే అన్ని బ్రాండ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. అయితే ప్రతి సీసాపై రూ. 30 నుంచి 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఇది నేరుగా సామాన్యుడి జేబుకు భారమవుతోంది. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు ఈ అదనపు ధరలతో ఇబ్బంది పడుతున్నారు.

**సందులు దాటి మెయిన్ రోడ్లకు...**

ముందు గ్రామాల అంచుల్లో, సందుల్లో మాత్రమే కనిపించిన బెల్ట్ షాపులు ఇప్పుడు ప్రధాన రహదారులపై కూడా ప్రత్యక్షమవుతున్నాయి. ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో వీటి కార్యకలాపాలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇది సామాజిక భద్రతపైనా ప్రభావం చూపుతోంది.

**ఎక్సైజ్ శాఖ మౌనం మద్దతా..?**

ఈ అక్రమ వ్యాపారం విస్తరిస్తున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో అధికారులు తెలిసీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆ శాఖ మద్దతుతోనే పాఠశాలలు, దేవాలయాలు, ఆటో అడ్డాలు, హోటళ్ళు పక్కన దర్జాగా బెల్ట్ షాపుల నిర్వహణ సాగుతుందనేది ప్రజల నుండి వస్తున్న వాదన..

**మద్యం మాఫియా ప్రోత్సాహం...**

బెల్ట్ షాపుల వెనుక మద్యం మాఫియా సంపూర్ణ హస్తం ఉంది. అంతే కాకుండా బంధువులను ఈ దందాలోకి దింపి భారీగానే ఆర్జిస్తుంది మాఫియా, అటు మద్యం మాఫియా, ఇటు బెల్ట్ మాఫియా దెబ్బకి మద్యం ప్రియులు గుల్లవుతున్నారు.

# పట్టాదార్ పాస్‌పుస్తకాలను ఇప్పించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండల పరిధిలోని మామునూరు గ్రామంలోని పేద రైతుల అసైన్ భూములకు పట్టాదార్ పాస్‌పుస్తకాలను ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు వినతిపత్రాన్ని అందచేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మామునూరు గ్రామంలో సుమారు 60మంది పేద రైతుల అసైన్ భూములకు పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని కోరారు. ఈ విషయం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క దృష్టికి తీసుకెళ్లినట్లు తెలపగా వెంటనే స్పందించిన కలెక్టర్ ఎర్రుపాలెం తహశీల్దార్‌ను వెంటనే సర్వే చేసి లిస్టు పంపాలని ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పెండింగ్ బిల్లులు ఇప్పించాలని, మొక్కజొన్న ధాన్యం కొనుగోళ్ల విషయంపై చర్చించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు బండారు నర్సింహారావు తెలిపారు.

# స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యం




**-ఎవ్రీ చైల్డ్ రీడ్స్‌తో పఠన సామర్థ్యంలో పురోగతి**
**-వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి**
**-ఎవ్రీ చైల్డ్ రీడ్స్ విజయోత్సవ కార్యక్రమంలో కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రతి విద్యార్థి స్వతంత్రంగా చదవగలిగే స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం ఎస్ ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా జిల్లాలో విజయవంతంగా అమలు చేసిన ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం వల్ల విద్యార్థుల పఠన సామర్థ్యం గణనీయంగా పెరిగినట్లు స్వతంత్ర సంస్థ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైందని తెలిపారు. ఈ పురోగతిపై కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పఠన సామర్థ్యం అత్యంత కీలకమని భావించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. పిల్లలతో ప్రత్యక్షంగా సంభాషిస్తూ నిర్వహించామని వారానికి ఒకసారి అంచనాలు నిర్వహిస్తూ ఫలితాల ఆధారంగా వ్యూహాలను మారుస్తూ ముందుకు తీసుకెళ్లామన్నారు. విద్యార్థుల స్థాయిని బట్టి ప్రత్యేక పాఠ్య సామగ్రిని రూపొందించామని ముఖ్యంగా వెనకబడిన విద్యార్థుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించి వారికి వేర్వేరు విధానాలు అమలు చేశామన్నారు. ఏఐ సాంకేతికతతో ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసి ఉపాధ్యాయులపై అంచనాల భారం లేకుండా సులభంగా విద్యార్థుల ప్రగతిని అంచనా వేయగలిగే విధంగా చర్యలు తీసుకున్నామన్నారు. డిసెంబర్ నెల నుంచి రోజు పాఠశాల సమయంలోనే మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అక్షరాలు, పదాలు, వాక్యాలు అనే మూడు స్థాయిల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాల అంచనా నిర్వహించామని తెలిపారు. 21 వారాల కృషి ఫలితంగా ప్రస్తుతం 29వేల మంది విద్యార్థుల్లో 85 శాతం మంది వాక్యాలు చదవగలుగుతున్నారని మొత్తం 21309 మంది విద్యార్థులు వాక్య పఠనంలో నైపుణ్యం సాధించగలిగారన్నారు. ఈ విజయానికి ఉపాధ్యాయులు, సిబ్బంది అందరూ గర్వించాలన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో వంద శాతం విద్యార్థులు వాక్యాలు చదివగలిగే లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం ఈసిఆర్ అమలులో ఉత్తమ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు కలెక్టర్, అదనపు కలెక్టర్ మెమోంటోలను అందజేసి విద్యార్థులు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పిసిఈవో దీక్షారైనా, జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని, విద్యా శాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సిహెచ్ రామకృష్ణ, సిఎంవో ప్రవీణ్, మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల కష్టాలను పట్టించుకోని ప్రభుత్వం

## మాజీ ఎమ్మెల్యే సండ్ర



**ప్రజాపక్షం/తల్లాడ :** ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మండి పడ్డారు. మంగళవారం ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో వెంటనే కొనుగోలును వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ తల్లాడలో రైతులతో కలిసి ధర్నా చేపట్టిన వెంకటవీరయ్య పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్ కరుణాకర్‌రెడ్డికి అందించారు. అనంతరం సొసైటీ కార్యాలయం వద్ద ధాన్యం బస్తాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో ఆయన ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం రైతుల ధాన్యాన్ని, మొక్కజొన్నలను కొనుగోలు చేసి సరైన గిట్టుబాటు ధర ఇచ్చి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, పట్టణ అధ్యక్షులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు ఈసూబ్, దగ్గుల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

# జిల్లా టాపర్‌కు ఘనసన్మానం



**ప్రజాపక్షం/ తల్లాడ :** పదో తరగతి సిబిఎస్ఇ ఫలితాల్లో ఖమ్మం జిల్లా ప్రథమ స్థానం, ఆలీండియా ఐదవ స్థానాన్ని దక్కించుకున్న తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన రెడ్డెం విజయభానును సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటరవీరయ్య సన్మానించారు. మంగళవారం తల్లాడ మండలంలో ఆయన పర్యటించారు. ఈ విషయం తెలుసుకున్న సండ్ర ఆ విద్యార్థిని ఇంటికి వెళ్లి ఆమెకు స్వీట్ తినిపించి శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈసందర్భంగా ఆమెకు ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తల్లిదండ్రులు రెడ్డెం నారాయణరెడ్డి, అరుణకుమారి దంపతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ తల్లాడమండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ కర్నాటి లక్ష్మారెడ్డి, నాయకులు దుగ్గిదేవర వెంకటలాల్, గరిడేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతిక వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు పెంపు



**-సాంప్రదాయ కోర్సులకు పరిమితం కాకూడదు**
**-తక్కువ ఫీజుతో నాణ్యమైన శిక్షణ**
**-చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పదవ తరగతి తర్వాత విద్యార్థులు కేవలం సాంప్రదాయ కోర్సులకే పరిమితం కాకుండా ఉపాధికి గ్యారెంటీ ఇచ్చే సాంకేతిక వృత్తి విద్యను ఎంచుకోవాలని హన్మకొండ జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి తెలిపారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ నందు కొండా లక్ష్మణ్ బాపూజీ ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టి) హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవగాహన సదస్సులో జిల్లా చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి ఆధునీక కాలంలో చేనేత రంగం ఫ్యాషన్ డిజైనింగ్, టెక్స్‌టైల్ కెమిస్ట్రీ వంటి అత్యాధునీక సాంకేతికతతో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 2026 27 విద్యా సంవత్సరానికి గాను డిప్లొమా ఇన్ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సులో ప్రవేశానికి ఉన్న అవకాశాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. మగ్గం నేయడమే కాకుండా క్యాడ్ (కంప్యూటర్ ఎయిడెడ్ డిజైన్), స్మార్ట్ గార్మెంట్స్ తయారీలో అంతర్జాతీయ స్థాయి శిక్షణ అందుబాటులో ఉంటుందని తెలిపారు. కోర్సు చదువుతున్న కాలంలో విద్యార్థులకు నెలకు రూ. 2,500 స్టైఫండ్, చేనేత కుటుంబాల వారికి అదనంగా ఐదువేల వరకు లభించే అవకాశం ఉందన్నారు. ఏడాదికి కేవలం రూ. 4,250 ఫీజుతో ఈ కోర్సు పూర్తి చేయవచ్చునని తెలిపారు. కోర్సు పూర్తయిన అనంతరం పెద్ద టెక్స్‌టైల్ కంపెనీలో లేదా స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత అర్హత ఉండగా మొత్తం 60 సీట్లు మెరిట్ ప్రాతిపదికన భర్తీ చేయడం జరుగుతుందని ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ మొదటి వారం లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ప్రాంగణం నాంపల్లి హైదరాబాద్‌లో సమర్పించాలన్నారు. ఖమ్మం జిల్లా విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత శాఖ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతకు ఆదర్శంగా మధిర పట్టణాన్ని తీర్చిదిద్దుతా





**ప్రజాపక్షం/మధిర :** స్వచ్ఛతకు ఆదర్శంగా మధిర పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు పట్టణ ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత కోరారు. మంగళవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లిలో కమీషనర్ సంపత్‌కుమార్, వార్డు కౌన్సిలర్లతో కలిసి విస్తృతంగా పర్యటించారు. ముందుగా డ్రై రిసోర్స్ కన్స్ట్రక్షన్ సెంటర్ (డిఆర్‌సిసి) తడిపొడి చెత్త వేరుచేసే మిషన్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి సిబ్బందితో చైర్‌పర్సన్ సుజాత మాట్లాడారు. తడి చెత్తను(ఆహార వ్యర్థాలు, కూరగాయల వ్యర్థాలు) సేంద్రీయ ఎరువుగా మార్చి ఈ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా మున్సిపాలిటీకి ఆదాయం వచ్చేలా చూడాలని సూచించారు. అలాగే ప్రజల్లో తడి, పొడి చెత్త వేరుచేసి ఇచ్చే పద్ధతిపై శానిటేషన్ అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. మడుపల్లిలోని 5, 6, 7 వార్డుల్లో మెయిన్‌రోడ్డు, వార్డుల్లో సిసి రోడ్ల కోసం డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్కని కలిసి మడుపల్లి రోడ్ల సమస్యను వివరిస్తానని తెలిపారు. మడుపల్లిలోని సైడ్ డ్రైనేజిలు, రోడ్లు సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇతర మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ తిరగబడి వ్యక్తి దుర్మరణం

**ప్రజాపక్షం/పెనుబల్లి :** పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామంలో విషాదం నెలకొంది. ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఇటుక బట్టీల యజమాని వల్లపు కోటేశ్వరరావు అలియాస్ బజార్ (60) దుర్మరణం చెందాడు. పెనుబల్లి మండలం మండాలపాడు గ్రామానికి చెందిన వల్లపు బజార్ మండలపాడు శివారులో ఇటుక తయారీ బట్టీలు నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే మంగళవారం ఉదయం ఇటుకల తయారీ కోసం మట్టిని తరలించి ట్రాక్టర్ తో మట్టిని బురద పాటు చేస్తుండగా ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్ ని నడుపుతున్న కోటేశ్వరరావు అలియాస్ బజార్ ట్రాక్టర్ కింద పడి బురదలో కూరికిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుబల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వియం బంజర ఎస్ఐ కే వెంకటేష్ ఈ ఘటన పై విచారణ చేపట్టారు.

# పేదల కలను సాకారం చేస్తున్న ప్రభుత్వం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం నిధానపురం గ్రామంలో మంగళవారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు అమరావతి సాబిరెడ్డి, అనసూర్యదంపతులు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ వెంపటి రత్నకుమారి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్‌లు ప్రారంభించారు. ఈసందర్భంగా సూరంశెట్టి కిషోర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని ముఖ్యంగా తీసుకుని ముందుకు సాగుతోందని కొనియాడారు. ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నాయకత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం సమర్థవంతంగా అమలవుతూ పేదల గృహ స్వప్నాన్ని సాకారం చేస్తోందని అభినందించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదలకు సొంత గృహాలు కల్పించడం వల్ల వారి జీవితాల్లో స్థిరత్వం, భద్రత, గౌరవం పెరుగుతున్నాయని తెలిపారు. ఈ పథకం ద్వారా అనేక కుటుంబాలు కొత్త జీవితం ప్రారంభిస్తున్నాయని, ఈ ప్రభుత్వ ప్రజా సంక్షేమానికి నిదర్శమని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మరింత మంది అర్హులైన వారికి ఈ పథకం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మండల బిసిసెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నిడమానూరి వంశీకృష్ణ, పత్తేరపు సంగయ్య, నిధానపురం గ్రామశాఖ అధ్యక్షులు గుండా వీరారెడ్డి, మాజీ సర్పంచ్ బాదా కృష్ణారెడ్డి, షేక్.జాకీర్‌హుస్సేన్, వెంపటి రమేష్, అమరవాది సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాబోధన



**ప్రజాపక్షం/ మధిర :** ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి సమానంగా అందుబాటులో ఉచితంగా లభించే మెరుగైన విద్య కోసం గ్రామస్తులు, తల్లిదండ్రులంతా కలిసి ఈ బడిబాట కార్యక్రమంలో అధికసంఖ్యలో విద్యార్థులను చేర్పించాలని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత కోరారు. మంగళవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ వేమిరెడ్డి నాగలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మడుపల్లి పాఠశాలను తొలిసారిగా సందర్శించిన చైర్‌పర్సన్ పాఠశాలలో ఉన్న మౌలిక సదుపాయాలు, ఈ విద్యా సంవత్సరంలో జరిగిన కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. ఒక ప్రభుత్వ పాఠశాలల్లో ఇన్ని వైవిధ్యమైన కార్యక్రమాలు నిర్వహించడం, క్రీడలు, సాంస్కృతి విభాగంలోనూ జిల్లా, రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న మడుపల్లి పాఠశాల విద్యార్థులను అభినందిస్తూ విశేషంగా కృషి చేస్తున్న ఉపాధ్యాయులు అంకితభావానికి ప్రశంసలు అందించారు. ఒక ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు, వినూత్న కార్యక్రమాలు, మెరుగైన ఫలితాలు ఉన్నప్పటికీ విద్యార్థుల తల్లిదండ్రులు ఇంకా ప్రైవేట్ పాఠశాలలవైపే మొగ్గు చూపటం సరైందని కాదన్నారు. అనంతరం చైరపర్సన్ సామినేని సుజాతను పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సంపత్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు సామినేని రామనాథం, కౌన్సిలర్లు శీలం నర్సిరెడ్డి, పిల్లి సునీత, వేమిరెడ్డి లక్ష్మీ తులసీ, గ్రామస్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాల పారవేతపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** గ్రామ పంచాయితీ పరిధిలో పెరుగుతున్న వ్యర్థాల సమస్యపై భారతీయ జనతా పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. టిఫిన్ సెంటర్లు, బెల్ట్ షాపులు, కిరాణా దుకాణాల నిర్వాహకులు నిర్లక్ష్యంగా ప్లాస్టిక్ బాటిల్స్, కవర్లు, మద్యం సీసాలు తదితర వ్యర్థాలను చెరువులు, వాగులు, వ్యవసాయ పొలాలు, రోడ్ల పక్కన వేయడం వల్ల గ్రామంలో దుర్వాసనలు వ్యాపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల గ్రామాల్లో జరిగే వివాహాలు, ఇతర వేడుకల తర్వాత మిగిలే ఇస్తరాకులు, ప్లాస్టిక్ గ్లాసులు వంటి వ్యర్థాలను కూడా ఎక్కడపడితే అక్కడ పడేస్తుండటంతో చెరువులు, వాగులు కలుషితమవుతున్నాయని తెలిపారు. వ్యవసాయ పొలాల్లో పడేసిన మద్యం బాటిల్స్, ప్లాస్టిక్ వల్ల రైతులకు, పశువులకు గాయాలు అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు, వ్యాపారులు వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారేయకుండా అవగాహన కల్పించి, చంద్రుగొండ పంచాయితీని పరిశుభ్రమైన గ్రామంగా తీర్చిదిద్దాలని కోరుతూ బీజేపీ నాయకులు భోగి కృష్ణ, జంగా సత్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, పంచాయితీ కార్యదర్శికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో పరిశుభ్రతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

## ఆత్మీయ భరోసా అమలు చేయాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పేరుతో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సింగరేణి మండలంలోని ఉపాధి హామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో మంగళవారం వ్యకాస ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి భూమిలేని సుమారు 22లక్షల వ్యవసాయ కూలీలకు ఆత్మీయ భరోసా అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే అధికారంలోకి వచ్చిన ఏడాది గడిచినా ఆ హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వీబీజీ రాంజీ కారణంగా పేదలు ఉపాధి అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండల తీవ్రతతో ఉపాధి కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, పని ప్రదేశాల్లో అమలు చేస్తున్న రెండు సార్ల ఫోటో విధానాన్ని రద్దు చేయాలని సూచించారు. పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి, పని ప్రదేశాల్లో టెంట్లు, మంచినీరు, మెడికల్ కిట్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యకాస మండల నాయకులు యనమనగండ్ల రవి, కేసగాని ఉపేందర్, పాసిని నాగేశ్వరరావు, చల్లా మల్లమ్మ, షేక్ సైదులు, కరపటి అరుణ, మద్దెల నాగయ్య, అన్నారపు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని సంధర్శించిన కాయకల్ప బృందం



**ప్రజాపక్షం/పాల్వంచ :** రోగులకు నాణ్యమైన సేవలను అందించటంతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాయకల్ప బృందం సభ్యులు రఘు అన్నారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా మంగళవారం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిని సంధర్శించారు. ఈ సంధర్భంగా ఇన్ పేషెంట్ వార్డు, ఔట్ పేషెంట్ వార్డులను, ల్యాబ్‌ను, డయాలసిస్ సెంటర్‌లను ఆసుపత్రి పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అందిస్తున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని సూచించారు. వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ పి. రాం ప్రసాద్, ఆర్ఎంఓ సోమరాజుదొర,ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు


**- స్వచ్ఛమైన తాగునీటిని నిరంతరం అందుబాటులో ఉండాలి**

**తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి : మేయర్ గణేష్**



**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫార్సు చేస్తామని, కార్పొరేషన్ పరిధిలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాలను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని మేయర్ మూడ్ గణేష్ హెచ్చరించారు. చలివేంద్రాల నిర్వహణపై ఆయన మంగళవార మాట్లాడారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచాలని, నీటిని అందించే వారు చలివేంద్రం వద్దే ఉండి సేవలు అందించాలని తెలిపారు. ప్రస్తుతం పట్టణంలోని 11 ప్రధాన సెంటర్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజల అవసరాల దృష్ట్యా మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో తాగునీటి యద్దడి ఎక్కడా రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంఎల్ఏ కూనంనేని సాంబశివ రావు ప్రత్యేక కృషితో అమృత్ స్కీమ్ క్రింద మంజూరైన నిధులతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే పనులు వేగవంతంగా జరుగుతుందని చెప్పారు. ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రతీ చుక్కనీరు సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన స్పష్టం చేశారు.

# సైలెన్సర్ల ధ్వనులతో న్యూసెన్స్





- రహదారులపై యువత హల్ చల్
- సైలెన్సర్ రకరకాల ధ్వనులతో హడలి పోతున్న ప్రజలు
- కట్టడి చేయాలని పోలీస్‌లను కోరుతున్న ప్రజలు

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** యువత క్రేజీగా నడుపుతున్న ద్విచక్ర వాహనాల నుండి వచ్చే ధ్వనులు ఎంతో ఇబ్బందిగా మారిందని మండల కేంద్రంలోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. యువత రోడ్ల వెంట ద్విచక్ర వాహనాలు నడుపుతున్నప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకుని ఇతరులకు అసౌకర్యం కలిగించకుండా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ద్విచక్ర వాహనాలను నడపడంలో యువత పోటీ పడుతున్నారు. ఇక మైనర్లనైతే అసలే ఆపలేం. సాధారణ బైక్ పైనే అనేక విన్యాసాలు చేసే యువత బుల్లెట్, కేటీఎమ్ వంటి బైక్ లు చేతికందితే వారి వేగానికి పరిమితి ఉండటంలేదు. అవి సందులు, గొందులైనా, ప్రధాన రోడ్డైనా రయ్, రయ్ మని అత్యంత వేగంగా దూసుకెళ్తుంటే చూసేవారికి బీపీ రెండింతలవ్వాల్సిందే. ఇంత వరకూ యువత బైక్ లపై చేసే వేగవంతమైన విన్యాసాలు బాగానే ఉన్నప్పటికీ వారు నడుపుతున్న వాహనాల నుండి వచ్చే ధ్వనులు మాత్రం భరించలేకుండా ఉందనే చర్చ మండలకేంద్రంలో జరుగుతోంది.

### సైలెన్సర్లతో హోరెత్తుతున్న రకరకాల ధ్వనులు...

ఒకప్పుడు యమహా ఆర్ఎక్స్100 బైక్ కు పిస్టిన్ లో ఉండే మఫ్లర్ తొలగిస్తే ఆ బైక్ సైలెన్సర్ నుండి వచ్చే ధ్వని రెట్టింపుగా ఉండేది. ఆ ధ్వని వల్ల యువత మరింత జోరుగా బైక్లను నడిపిస్తుండే వారు. కాలనీ సందుల్లో, ఇతర రోడ్లైనా అదే ధ్వనితో దూసుకెళ్లడం చేసేవారు. కొన్నాళ్లు ఈ ట్రెండ్ ను క్రేజీగా అనుసరించిని యువత తర్వాత మార్కెట్ లోకి వచ్చిన అనేక రకాల ద్విచక్ర వాహనాలపై దృష్టి సారించారు. అందులో వాహనాల సైలెన్సర్ల నుండి వచ్చే సౌండ్ ను బట్టి ఆ బైక్ లను సొంతం చేసుకోవడానికి యువత ఆసక్తి చూపిస్తున్నట్టు తెలుస్తోంది.

### బైకులతో న్యూసెన్స్ చేయడమే లక్ష్యమా..?

అనేక కంపెనీల తాజా బైక్ లు యువత అభిరుచులకు తగ్గట్టు మార్కెట్ లోకి అందుబాటులోకి తీసుకు వచ్చాయి. తాజాగా మార్కెట్లోకి బుల్లెట్, రాయల్ ఎన్ఫీల్డ్ వంటి ద్విచక్ర వాహనాలు కూడా యువతకు పెద్ద ఎత్తున అందుబాటులోకి రావడంతో యువతకు బైక్ ఎంత హెవీగా ఉన్నా కొనుగోలు చేసి రహదారుల వెంట రకరకాల ధ్వనులతో ప్రజల మధ్య విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ మండల కేంద్రంలో న్యూస్ చేసే సంఘటనలు కోకొల్లలు.

### ఇబ్బందికరంగా మారిన ద్విచక్ర వాహన ధ్వనులు...

బైక్ లను కొనుక్కోవడంలో యువత ఆసక్తి చూపిస్తూ రకరకాల నూతన బైక్ ల మీద దూసుకెళ్తుండడం చూస్తుంటే స్నేహితులకు, తల్లిదండ్రులకు సంతోషాన్నిస్తున్నా ఇతర ప్రజానికానికి మాత్రం కాస్త ఇబ్బందికరంగా మారింది. యువత నూతన బైక్ ల సవారీ చేయడమే కాదు ప్రజలకు ఇబ్బందికరంగా ఉందనే అంశాన్ని గుర్తుంచుకోవాలంటున్నారు ప్రజలు. బైక్ పై వేగంగా దూసుకెళ్లడమే కాకుండా దానివల్ల కలుగుతున్న అసౌకర్యాలను పరిగణలోకి తీసుకొని స్థానిక పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు చేపట్టి ఆకతాయిలను, ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేస్తున్న యువకులను మైనర్లను, కట్టడి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## నీడ లేక ప్రయాణీకుల అవస్థలు

- ప్రధాన రహదారిపైనే నిలిచిపోయిన ప్రయాణం
- ప్రయోజనం లేకుండా పోయిన పాత బస్టాండ్
- వేపచెట్టే ఆశ్రయం ఎండలో రోజూ వందలాది మంది అవస్థలు





**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురం మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడం ప్రయాణికులకు శాపంగా మారింది. మణుగూరు, కొత్తగూడెం ప్రధాన రహదారి నుండి మండల తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో సుమారు 30 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత బస్టాండ్ ప్రస్తుతం నిరుపయోగంగా మారిపోయింది. ఒకప్పుడు గ్రామానికి రవాణా కేంద్రంగా నిలిచిన ఆ బస్టాండ్, ఇప్పుడు కేవలం జ్ఞాపకంగా మిగిలిపోవడం దురదృష్టకరం. ప్రస్తుతం బస్సులు ప్రధాన రహదారిపైనే ఆగిపోతుండటంతో ప్రయాణికులు బస్టాండ్ వరకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు సహా రోజు 100 నుండి 200 మంది వరకు రహదారిపైనే నిలబడి బస్సుల కోసం ఎదరుచూడాల్సిన దుస్థితి నెలకొంది. నిలబడటానికి సరైన ప్రదేశం లేక, కూర్చునే సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఆ ప్రదేశంలో ఉన్న ఒక వేపచెట్టే ప్రయాణికులకు తాత్కాలిక ఆశ్రయం, ఎండ మండుతున్నా, వాన కురుస్తున్నా, చలి కొరికినా ప్రజలు అదే చెట్టు కింద నిలబడి బస్సుల కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ పరిస్థితి చూసినా అధికారుల గుండెల్లో మాత్రం చలనం కనిపించకపోవడం బాధాకరం. ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ, డ్రైనేజీ పనులు చేపట్టినప్పటికీ బస్టాండ్ నిర్మాణం మాత్రం ఊహల్లోనే మిగిలిపోయింది. పనులు పూర్తయ్యాక బస్టాండ్ నిర్మిస్తారన్న ఆశ కూడా వృథా అయింది. చివరకు బస్టాండ్ నిర్మాణం అనే మాటనే మరచిపోయినట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. మండల ప్రధాన కేంద్రంగా ఉన్న అశ్వాపురంలోనే ఇలాంటి దుస్థితి ఉంటే, గ్రామీణ ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ప్రజల ప్రాథమిక అవసరమైన బస్టాండ్ సౌకర్యం కల్పించడంలో విఫలమవుతున్న అధికారుల పనితీరుపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ఆధునిక సదుపాయాలతో కూడిన బస్టాండ్ నిర్మాణాన్ని చేపట్టాలని, లేకపోతే ప్రజల సహనానికి పరీక్ష పెట్టినట్టే అవుతుందని ప్రయాణికులు హెచ్చరిస్తున్నారు.

## చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు ఉద్యమ్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**డీపీఎం ఆంజనేయులు**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** యువత మరియు మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నా, చిన్న తరహా పరిశ్రమలు స్థాపించాలన్నా ప్రభుత్వం అందించే సబ్సిడీ రుణాలు పొందడానికి "ఉద్యమ్" రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండల కేంద్రం లోని మదర్ తెరిసా మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఉద్యమ్ రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల బలోపేతానికి ప్రభుత్వం అనేక రాయితీలు కల్పిస్తోందని, ఆ అవకాశాలను అందుకోవడానికి ప్రతి ఒక్కరూ పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా నేలకొండపల్లి మండలంలోని మహిళా సంఘాల సభ్యులు ఉత్పాదక రంగాలపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీసీలు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, వివిధ గ్రామ సంఘాల బాధ్యులు, వీవోఏలు పాల్గొన్నారు.

# కూసుమంచి మండలంలో మొక్కజొన్న రైతుల ఆవేదన



**కొనుగోలు కేంద్రం ఒక్కటే.. రైతుల కష్టానికి విలువ ఎక్కడ...?**



**ప్రజాపక్షం/కూసుమంచి:** కూసుమంచి మండలంలో మొక్కజొన్న రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. మండల వ్యాప్తంగా సుమారు 8వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరగగా, ప్రభుత్వం మాత్రం ఒక్కటే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం రైతులకు భారంగా మారింది. ఒక ఎకరానికి సగటున 35 నుండి 40 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, ప్రభుత్వం మాత్రం 26 క్వింటాళ్లకే పరిమితం చేస్తామని చెప్పడం రైతులను తీవ్ర నిరాశకు గురి చేస్తోంది. పదుల ఎకరాల్లో సాగు చేసిన రైతులు తమ ఉత్పత్తిని ఎక్కడ అమ్మాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం సుమారు 2.40లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనా ఉండగా, దానికి 4.80 వేల బ్యాగులు అవసరం. అయితే ప్రస్తుతం 5,000 బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉండటం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. ధరల విషయంలో కూడా నైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాకు రూ 2,400 చెల్లిస్తామని చెబుతున్నా, కొనుగోలు పరిమితుల వల్ల చాలా మంది రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో రూ 1,750కే అమ్మాల్సి వస్తోంది. రవాణా సదుపాయాల లోపం కూడా పెద్ద సమస్యగా మారింది. ఒక్కో లారీకి సుమారు 650 బ్యాగులు లోడ్ వేస్తే, మొత్తం పంట తరలించడానికి సుమారు 740 లారీల అవసరం ఉండగా, ఇప్పటి వరకు కేవలం 15లారీలు మాత్రమే పంపడం రైతుల్లో ఆగ్రహాన్ని రేకెత్తిస్తోంది. ఇక వాతావరణం కూడా అనుకూలంగా లేకపోవడంతో, పంట నష్టపోతుందనే భయంతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగులు తీస్తున్నాయి. అధికారులు పరిస్థితిని గుర్తించి చర్యలు తీసుకోవాలని ప్రయత్నిస్తున్నప్పటికీ, ప్రభుత్వం మాత్రం సరైన స్పందన ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రైతుల డిమాండ్లు...

మర్నిన కొనుగోలు కేంద్రాల ఏర్పాటు, పూర్తి దిగుబడిని కొనుగోలు చేయడం, సరిపడా గోనె సంచులు, లారీలు ఏర్పాటు, వెంటనే కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలని, పంట పడితే సమస్య, అమ్మాలంటే మరింత సమస్య అనే పరిస్థితిలో కూసుమంచి రైతులు ప్రభుత్వాన్ని ప్రభుత్వం తమ సమస్యను తీరుస్తుందని ఎదురుచేస్తున్నారు రైతులు.

### ఆందోళనకు సిద్ధమవుతున్న మొక్కజొన్న రైతులు....

వీలైనంత తొందరలో కూసుమంచి మండలంలో మరి కొన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోయినా లేక సరిపడిన లారీలు గని బస్తాలు అందకపోతే అత్యంత త్వరలో కూసుమంచి మండల వ్యాప్తంగా మొక్కజొన్న రైతులు ఆందోళన చేయడానికి సంసిద్ధంగా ఉన్నట్లు అత్యంత విశ్వాసనీయ సమాచారం.

## ఐకెపి ధాన్య కొనుగోలు కేంద్రాల ప్రారంభం

**-రైతు భరోసా నిధుల విడుదలపై వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంఎల్ఏ జారె**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో ఎంఎల్ఏ జారె ఆదినారాయణ విస్తృతంగా పర్యటించారు. ఈసందర్భంగా సీతాయిగూడెం, పూసుగూడెం గ్రామాలలో స్వయం సహాయక సంఘం మహిళల ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఐకెపి వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం రెండవ విడత రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేయనున్న నేపథ్యంలో పూసుగూడెం రైతు వేదికలో ఏర్పాటు చేసిన వ్యవసాయ శాఖ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల ప్రయోజనాలు అర్హులందరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్, ఏవో అరుణ్ కుమార్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఏపీఎం రామ్ కుమార్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొడిమే వంశీ, సర్పంచ్ కుంజా రవి, మాజీ సర్పంచ్ కారం సుధీర్, మాజీ సర్పంచ్ భూక్యా పత్తిలాల్, మాజీ సొసైటీ అధ్యక్షులు కారుటూరి కృష్ణ, మండల నాయకులు కొప్పుల రాంబాబు, సురభి రాజేష్, పాల్గొన్నారు.

## బూర్గంపాడులో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**-కేజీబీవీ పాఠశాల పరిశీలన, ధాన్యం కొనుగోళ్లపై ఆదేశాలు**





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారంలో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ అంకిత్ బూర్గంపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యా కార్యక్రమాల అమలు, పాఠశాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్, డ్రాయింగ్ పోటీలను పరిశీలించిన కలెక్టర్, విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని, మరింత విస్తృతంగా నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం అత్యంత అవసరమని తెలిపారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం కలెక్టర్ పరిశీలన..

అనంతరం బూర్గంపాడు వ్యవసాయ కమిటీ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యాన్ని పరిశీలించి, మాయిశ్చర్ మీటర్ ద్వారా తేమ శాతాన్ని తనిఖీ చేశారు. పిఆర్ 126 దొడ్డు రకం ధాన్యం నాణ్యతపై రైతులు వ్యక్తం చేసిన సందేహాలపై వ్యవసాయ శాఖ అధికారలుతో చర్చించి, పిన్ పాయింట్ డ్యామేజ్ సమస్యపై పూర్తి వివరాలు సేకరించి ఉన్నతాధికారలుతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల విషయంలో స్పష్టత తీసుకువచ్చి రైతులకు నష్టం కలకుండా చూడాలని తెలిపారు. కొనుగోలు రిజిస్టర్, రసీదు పుస్తకాలను పరిశీలించి నమోదు విధానాన్ని సమీక్షించారు. ఈ పర్యటనలో తహసీల్దార్ కేఆర్కే ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఎంపీడీవో జమలారెడ్డి, మండల వ్యవసాయ అధికారి ఆర్ శంకర్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్ కుమార్, ఉప సర్పంచ్ గుండె వెంకన్న, ఏఈవోలు, సొసైటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** జిల్లాలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లాలోని తహశిల్దార్లు, ఎంపిడిఓలు, ఏఓలు, సంబంధిత అధికారుతో టెలికాన్ఫిరెన్స్ ద్వారా కొనుగోలు ప్రక్రియపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 83635 మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలోపెట్టుకుని మొత్తం 168 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 56 కేంద్రాలకు ధాన్యం చేరిందని, ములకలపల్లి, అన్నపురెడ్డిపల్లిలో అధిక ధాన్యం వచ్చినట్లు తెలిపారు.వ్యవసాయశాఖ అధికారులు గ్రేడింగ్ ప్రక్రియను మార్గదర్శకాల ప్రకారం సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలద్వారానే అమ్ముకోవాలని, ధాన్యాన్ని తాలు, తడి లేకుండా శుభ్రంగా కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

## చట్టాల అమలుకై పోరాడుదాం



**ప్రజాపక్షం/పాల్వంచ :** కనీస వేతన సవరణ, కార్మిక చట్టాల అమలు కోసం పోరాడాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు గౌని నాగేశ్వరరావు అన్నారు. అఖిల భారత కార్మిక డిమాండ్స్ దేను పురస్కరించుకొని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టియు ) జాతీయ కమిటి పిలుపులో భాగంగా నటరాజ్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ కనీస వేతన సవరణ, కార్మిక చట్టాల అమలు కోసం సాగుతున్న కార్మిక ఉద్యమాలకు కార్మిక సంఘాలు సంఘీభావం తెలపాలని కోరారు. బీహార్, హర్యానా, గుజరాత్, ఉత్తరప్రదేశ్,మధ్యప్రదేశ్, చత్తీస్‌గడ్ లాంటి రాష్ట్రాలలో కార్మిక ఉద్యమాలు ఉవ్వెత్తున లేస్తున్నాయని, వారి హక్కుల కోసం పోరాడుతున్నారని అన్నారు. కార్మికులకు మద్దతుగా నిలుస్తున్న వారిపై కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. అధికారం అడ్డం పెట్టుకొని ఉద్యమాలను అణిచివేయలేరన్నారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ ఏరియా కార్యదర్శి మంకెన వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి మల్లేష్, రాజేష్, గోపి, వెంకటేశ్వర్లు, శ్రీను, రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ మోటార్‌తో నీటి సరఫరా ప్రారంభం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** బెండాలపాడు గ్రామ పంచాయితీ పరిధిలోని గొత్తికోయలు నివసిస్తున్న ఎర్రబోడు ప్రాంతంలో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. స్థానిక సర్పంచ్ బొర్రా లలిత ఆధ్వర్యంలో సోలార్ సౌర విద్యుత్ మోటార్‌తో పాటు నీటి నిల్వ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి, గ్రామ ప్రజలకు నీటి సరఫరాను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో దిశ కమిటీ సభ్యులు బొర్రా సురేష్ కూడా పాల్గొని పనులను పర్యవేక్షించారు. దీని ద్వారా ఎర్రబోడు ప్రాంత ప్రజలకు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించినట్లు స్థానికులు తెలిపారు. ఈసందర్భంగా ఎర్రబోడు నివాసులు మాట్లాడుతూ తమ సమస్యను సకాలంలో గుర్తించి పరిష్కరించిన సర్పంచ్ బొర్రా లలిత, దిశ కమిటీ సభ్యుడు బొర్రా సురేష్, గ్రామ పంచాయితీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బానోవత్ బాలు, పంచాయితీ కార్యదర్శి రోహిత్, పంచాయితీ సిబ్బంది, ఎర్రబోడు నివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని సందర్శించిన ప్రోగ్రాం ఆఫీసర్



**ప్రజాపక్షం/పాల్వంచ :** జిల్లా వైద్యాధికారి తుకారాం రాథోడ్ ఆదేశాలతో ప్రోగ్రాం ఆఫీసర్ ప్రతాప్, సిహెచ్ఓ నాగభూషణంలు శేఖరం బంజెర పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని, కరకవాగు సబ్ సెంటర్‌ను మంగళవారం సంధర్శించారు. ఈ సంధర్భంగా సిబ్బంది హాజరు పట్టికను, రిజిస్టర్లను, సిసిపి వ్యాక్సిన్, ఐఎల్ఆర్ గదిని పరిశీలించారు. తు సూచనలు, సలహాలు అందజేశారు.అనంతరం ఎంజేబిసిడబ్ల్యూ కళాశాలను సందర్శించి ప్రిన్సిపాల్‌తో హెచ్‌పివి వ్యాక్సినేషన్‌పై చర్చించారు. దీనిపై విద్యార్థులకు సరైన అవగాహమ కల్పించాలన్నారు.

## చక్కటి ప్రణాళికతో విద్యా సం.ను ప్రారంభించాలి



**ప్రజాపం/ కొత్తగూడెం :** చక్కటి ప్రణాళికతో రానున్న విద్యా సం.ను ప్రారంభించాలని జిల్లా విద్యాధికారి బి నాగలక్ష్మి అన్నారు. ఈ విద్యా సం. సంవత్సరాంతం ముగింపు సందర్భంగా ఐడిఓసిలో జరిగిన కార్యక్రమంలో ఆమె జిల్లాలో విద్యాశాఖ సిబ్బందితో ఆమె మాట్లాడారు. గడిచిన ఏడాది లోటుపాట్లు సమీక్షించుకుని నూతన విద్యాసం. ఏ విధంగా ప్రారంభించాలో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని , మంచి ఫలితాలు రాబట్టేందుకు అంతా కృషి చేయాలని సూచించారు. పాఠశాలల మరమ్మత్తులు సమీక్షించారు. వివిధమండలాల్లో భవిత భవనాల నిర్మాణాల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి పాఠశాలలు తెరిచే నాటికి పిల్లలకు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**-నేతన్న భరోసా పథకం ద్వారా ఆర్థిక భద్రత**
**-151 మంది చేనేత కార్మికులకు రూ.4.56 లక్షలు పంపిణీ**
**-నేతన్న భరోసా చెక్కులు పంపిణీ చేసిన కలెక్టర్**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** చేనేత కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం 151 మంది అర్హులైన చేనేత కార్మికులకు రూ. 4,56,000 విలువైన నేతన్న భరోసా చెక్కులను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రజాప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు చేనేత కార్మికులకు ఆర్థికంగా ఎంతో తోడ్పాటు నందిస్తున్నాయని తెలిపారు. నేతన్న భరోసా పథకం ద్వారా కార్మికులకు భరోసా కల్పించి వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చడమే లక్ష్యమని తెలిపారు. చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. నేతన్నలు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నాణ్యమైన వస్త్రాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి కార్మికుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హన్మకొండ చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎం. విజయలక్ష్మి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించి పారదర్శకంగా చెక్కుల పంపిణీ నిర్వహించినట్లు తెలిపారు. 151 మంది చేనేత కార్మికులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందారన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖల అధికారులు, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# కోల్డ్‌స్టోరేజి అగ్ని ప్రమాద బాధితులకు నష్టపరిహారం అందించాలి

**ప్రజాపక్షం/మధిర :** ఖమ్మం జిల్లా మధిర మండలం ఆత్కూరు గ్రామం వద్ద ఉన్న సాయిబాలాజీ కోల్డ్‌స్టోరేజ్ అగ్నిప్రమాద బాధిత రైతులకు సత్వరమే నష్టపరిహారం అందించాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం, పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం నందు కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌కు వినతి పత్రాన్ని అందచేశారు. ముందుగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, రైతు పోరాట కమిటీ కన్వీనర్ దివ్వెల వీరయ్య, కో కన్వీనర్ సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు గత వ్యవసాయ సీజన్లో మిర్చి ధర తక్కువ ఉండటంతో ధర పెరుగుతుందని ఆశతో కోల్డ్‌స్టోరేజిలో మిర్చి నిల్వ ఉంచారని అన్నారు. అగ్ని ప్రమాదం మూలంగా రైతులు సర్వం కోల్పోయిన పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని రైతులకు నూరుశాతం ఇన్సూరెన్స్ వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తక్షణమే రైతు అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.5వేలు ఆర్థిక సాయం అందించి రైతులను ఆదుకోవాలని




విజ్ఞప్తి చేశారు. కోల్డ్‌స్టోరేజి అగ్ని ప్రమాదంలో తమ కళ్ల ఎదుటే మిర్చి పంట కాలి బూడిదైపోవడంతో బాధిత రైతు కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటూ రోడ్డున పడే పరిస్థితికి వచ్చారని, ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపించి బాధిత రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎస్కే మీరా, నాయకులు, బాధిత రైతులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించిన పీడి విజేత





**-పద్ధతి మార్చుకోవాలని హెచ్చరిక**
**-గుడ్డు జాడలేదు, మెనూ పాటించకపోవటంతో టీచర్‌పై ఆగ్రహం**




**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజేత మంగళవారం సత్తుపల్లి మండలంలోని గంగారం సర్కిల్ పరిధిలో గల అంగన్ వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆదివారం ప్రజాపక్షం తదితర పత్రికలలో వచ్చిన కథనాలపై స్పందించిన జిల్లా అధికారిణి అంగన్ వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో పీడీ విస్తుపోయారు. అంగన్ వాడీ సెంటర్ లో మెనూ పాటించకపోవటం, చిన్నారులకు గుడ్డు పెట్టకపోవటంతో పాటు సగం ,సగం కట్ చేసిన విస్తరాకులలో భోజనం వడ్డించటంతో టీచర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఆయా విధులకు హాజరు కాకపోవడంపై ప్రశ్నించారు. అంగన్ వాడీ కేంద్రం చుట్టూ పరిశుభ్రత లేకపోవడంతో పద్ధతి మార్చుకోవాలని సున్నితంగా హెచ్చరించారు. చిన్నారుల బరువు, ఎత్తు కొలిచే పరికరాలను సక్రమంగా అమర్చలేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. మరో సెంటర్ లో విద్యార్థుల హాజరు నమోదు చేయకపోవడంపై టీచర్ ని ప్రశ్నించారు. విద్యార్థులు ఏ బిసిడిలు కూడా చెప్పలేకపోవటంతో పీడి విస్తుపోయారు. పౌష్టికాహారం తో పాటు విద్యాబుద్ధులు కూడా నేర్పించాలని, చిన్నారులకు పాఠశాల పై మక్కువ కలిగేలా టీచర్లు వ్యవహరించాలన్నారు. పద్ధతి మార్చుకోవాలని లేకుంటే పనిష్మెంట్ తప్పదని హెచ్చరించారు. త్వరలోనే సిడిపిఓ , సూపర్ వైజర్ లతో సమావేశం నిర్వహిస్తానన్నారు. పత్రికలలో వచ్చిన ప్రతి దానిని క్షుణ్ణంగా పరిశీలిస్తానన్నారు. కిందిస్థాయి సిబ్బందికి తెలియకుండానే తన ఆకస్మిక పర్యటనలు ఉంటాయని, నిర్లక్ష్యం చేసే ఎవరిని ఉపేక్షించనని కఠిన చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు తూచా తప్పకుండా అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

# మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు చేయాలి

**రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడుపల్లి**



**ప్రజాపక్షం/చింతకాని :** మొక్కజొన్న పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం బోనకల్ ప్రధాన రహదారిపై నాగులవంచ వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా మడుపల్లి మాట్లాడుతూ రైతులు పండించిన మొక్కజొన్న ఎకరాకు 26.5 క్వింటాళ్ల నిబంధన లేకుండా కొనుగోలు చేయాలని, కాటాలు వేసిన మొక్కజొన్న బస్తాలు వెంటనే తరలించాలని కౌలు రైతులు కు అకౌంట్ కౌలు రైతులదే ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. తక్షణమే మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు తోటకూరి వెంకటనర్సయ్య, నాయకులు ఆలస్యం రవి, బల్లి వీరయ్య, మడిపల్లి కిరణ్ బాబు, ఆళ్ళ మాధవరావు, రైతు అప్పారావు, గద్దం కోటేశ్వరరావు, ఓబెనబోయినఅచ్చయ్యపాల్గొన్నారు.

# వాటర్ డిస్పెన్సర్‌లను ప్రారంభించిన ఎంపిడిఓ



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండల పరిధిలోని కొత్తవెంకటగిరి గ్రామానికి చెందిన పాకాలపాటి వెంకటేశ్వర్లు వారి సతీమణి కీర్తిశేషులు పాకాలపాటి శేఖరమ్మ జ్ఞాపకార్థం మూడు డిస్పెన్సర్లను అందించారు. అందులో రెండు తల్లాడ, మరొకటి అంజనాపురం గ్రామపంచాయతీ కార్యాలయానికి అందించారు. వీటిని ప్రారంభించిన అనంతరం ఎంపిడిఓ శ్రీధర్‌రాజు మాట్లాడుతూ పెరుగుతున్న ఎండ వేడి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని చల్లని నీటిని తాగించాలని ఆలోచన రావటం గొప్ప విషయమని అభిప్రాయపడ్డారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ నల్లగొర్ల రాధా, ఉపసర్పంచ్ కేతినేని చలపతి, తొండపు సాయి తదితరులు పాల్గొన్నారు.

# జెఈఈ మెయిన్స్‌లో స్టెమ్‌పార్క్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ఖమ్మం విద్యావిభాగం :** స్థానిక శ్రీనగర్ కాలనీలోని స్టెమ్‌పార్క్ జూనియర్ కళాశాల విద్యార్థులు జెఈఈ మెయిన్స్ 2026 ఫలితాలలో ఆల్ఇండియా ర్యాంకును సాధించి సత్తా చాటారు.బి.అవినాష్ ఆల్ఇండియా 393వ ర్యాంకు, జి.అంజలి 2055,బి.జ్ఞాన శ్రీ 3069, వెంకటసాయి పవన్ 6843, సాయి చరణ్,11927, ప్రవీణ్ 12198,నాగ కార్తికేయ 17246, పావని 18554 లతో పాటు 13 మంది విద్యార్థులు జెఈఈ అడ్వాన్స్ కు అర్హత సాధించారు.ఈ సందర్భంగా స్టెమ్‌పార్క్ డైరెక్టర్ కొండా శ్రీదర్ రావు మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో విజయమే లక్ష్యంగా కళాశాలను స్థాపించి సామాన్య విద్యార్థులతో కూడా అసమాన ఫలితాలను సాధించామని తెలియజేసారు.ఆల్ ఇండియా 393 వ ర్యాంకు సాధించిన అవినాష్ మరియు అర్హవత సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ,విద్యార్థుల తల్లితండ్రులు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ వారంలో భాగంగా టాలెంట్ టెస్ట్

**-విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు వివిధ పోటీలు**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో నిర్వహిస్తున్న సంక్షేమ వారం కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మంగళవారం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. జిల్లాలోని 166 హాస్టళ్లు, కెజిబివిలు, గురుకులాలు, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి వివిధ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తృత్వం (ప్రసంగం), క్విజ్, డ్రామా, డ్యాన్స్, సింగింగ్, క్యారమ్, రన్నింగ్ వంటి క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు, సంక్షేమ శాఖ సిబ్బంది పర్యవేక్షించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని అధికారులు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండల పరిధి లోని ముష్టికుంట్ల గ్రామంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశాలతో సొసైటీ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మధిర వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నర్సింహారావు, సర్పంచ్ పిల్లలమర్రి నాగేశ్వర రావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఇబ్బంది లను తెలుసుకుని కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ ప్రాంత మొక్కజొన్న రైతులు ఈ కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి రామకోటేశ్వరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బంధం శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సీతయ్య, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బోయిపల్లి వెంకటేశ్వర్లు, వార్డు నెంబర్లు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తున్న మోడీ



**ప్రజాపక్షం/పెనుబల్లి :** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉపాధి హామీ చట్టం రోజు రోజుకు బలహీనపడుతూ రాబోయే రోజుల్లో ఉపాధి హామీని పూర్తిగా ఎత్తివేయడం కోసం కుట్రలు, కుతంత్రాలు చేయడంలో భాగంగానే బీజేపీ రాంజీ పథకాన్ని తీసుకురావడం ఆ కుట్రలో భాగమేనని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు గాయం తిరుపతిరావు, చెమట విశ్వనాథం మోడీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. పెనుబల్లి మండలంలోని పార్థసారధిపురం గ్రామంలో మంగళవారం వారు ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలను కలిసి వారికున్నటువంటి సమస్యలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు కుంజా ఈద బాబు, సున్నం శివ, పోతమ్మ, ముత్తమ్మ, రాజమ్మ, పోతురాజు, కుంజదాసు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలి

## కార్మికుల ఐఖ్యపోరాటంతోనే హక్కుల సాధన
## సమ్మెకు సంపూర్ణమద్దతు : ఎంఎల్ఏ కూనంనేని






**ప్రజాపక్షం/ కొత్తగూడెం :** ఆర్టీసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో కార్మికుల పక్షాన నిలబడి పోరాటాలను ఉధృతం చేస్తామని కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. నేటి అర్థరాత్రి నుండి ఆర్టీసీ కార్మిక, ఉద్యోగసంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న సమ్మెకు సిపిఐ రాష్ట్ర సమితి పక్షాన సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మంగళవారం కొత్తగూడెంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఎన్నికల హామీ మేరకు ఆర్టీసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు.కార్మిక సంఘాల గొంతులను నొక్కేలా ట్రేడ్ యూనియన్లపై విధించిన ఆంక్షలను ఎత్తేసి వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. నిలిచి పోయిన రెండో వేతన సవరణను వెంటనే తక్షణమే అమలు చేయాలని, 2013 వేతన సవరరణ బకాయిలను వెంటనేవిడుదల చేయాలని పేర్కొన్నారు. సంస్థ మనుగడ కోసం, ప్రయాణికుల రక్షణ కోసం కొత్తబస్సులు కొనుగోలు చేయాలని అన్నారు. కార్మికులకు పని భద్రత కల్పిస్తూ వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి ప్రభుత్వం సమ్మెను విరమింపజేయాలని సూచించారు. కార్మికుల న్యాయమైన కోర్కెలు తీరకుంటే తమ పోరాటం ఆగదని, సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు చేస్తున్న సమ్మె ద్వారా పాలకులకు బుద్ధి వచ్చేలా ప్రజా రవాణాను స్తంబింపచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా అన్నారు. జిల్లాలోని కొత్తగూడెం, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు బస్సు డిపోల నుండి ఒక్క బస్సు కూడా బయటకురాకుండా ఉద్యోగులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమ్మె శాంతియుతంగా, సంపూర్ణంగా జరిగేలా సిపిఐ శ్రేణులు కృషి చేయాలని కోరారు.


# మంత్రి తుమ్మలపై విమర్శలు సిగ్గుచేటు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే అభివృద్ధి ప్రధాతగా పేరుగాంచిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన విమర్శలు సిగ్గుచేటని దీనిని రఘునాథపాలెం మండల కాంగ్రెస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు నాయకులు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పై పువ్వాడ అజయ్‌కుమార్ చేసిన విమర్శలు అర్థ రహితమన్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని మారు మూల గ్రామాలను సైతం అభివృద్ధి చేసిన ఘనత మంత్రి తుమ్మలదన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల అభ్యున్నతికి మంత్రి తుమ్మల కృషి చేశారన్నారు. కేసిఆర్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇంటికెళ్లి బిఆర్ఎస్‌లో చేరమని అడిగారని అది గుర్తుంచుకోవాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయడమే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లక్ష్యమన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావును తుమ్మమొద్దు అని మాట్లాడటం మీ దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. తుమ్మ మొద్దా లేదా తుమ్మముల్లో 2023లో జరిగిన ఎన్నికల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వచ్చిన మెజార్టీయే నిదర్శనమన్నారు. మంత్రి తుమ్మల గురించి మీ తండ్రి గారిని అడిగి తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు. పువ్వాడ అజయ్‌కుమార్ అంటేనే అవకాశ వాద రాజకీయాలకు ఉదాహరణ అన్నారు. మళ్లీ వచ్చే ఎన్నికల్లో ప్రజలు మీకు తగిన గుణపాఠం చెబుతారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ దీప్లానాయక్, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆత్మ ఛైర్మన్ దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, మాజీ సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, దారవత్ రామ్మూర్తి, రాము, చెరుకూరి పూర్ణచందర్‌రావు, కొంటెముక్కుల నాగేశ్వరరావు, బండి వెంకన్న, సుధీర్, శ్రీను, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రభంజనం

**ప్రజాపక్షం/వైరా :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) వారు జాతీయ స్థాయిలో నిర్వహించిన జేఈఈ మెయిన్స్ 2026 వ సంవత్సరానికి గాను ఏప్రిల్ 20వ తేదీన ప్రకటించిన ఫలితాల్లో న్యూలిటిల్ ఫ్లవర్ ఫౌండేషన్ పూర్వ విద్యార్థులు, ప్రస్తుత మా విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు కనబరిచి విజయ దుందుభి మ్రోగించారు. 2026వ సంవత్సరానికి గాను జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్ నందు మా విద్యార్థులు 20 మంది క్వాలిఫై అయి జేఈఈ డ్వాన్స్ వ్రాయడానికి అర్హత సాధించారు. ఇందుకు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ ఓ ప్రకటనలో తెలియజేస్తూ పూర్వ, ప్రస్తుత విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు. అత్యున్నత ర్యాంకు సాధించిన మా విద్యార్థులు బి.ఠాగూర్, తేజ్‌చరన్, ఈశ్వర్, గణేష్ సాయి, జేఈఈ అడ్వాన్స్ పరీక్షలకు అర్హత సాధించిన విద్యార్థులు జి.స్వేచ్ఛ, సి.హెచ్.సాయి కృష్ణ, నాగినేని గోపిక అక్షయ, పాలకుర్తి అభినయ్, రేచర్ల యశస్విని, వల్లభి సాయి, సురేందర్, హరిచరన్, బి.మైత్రి, ఆర్.రోహిత, కీర్తన, విశాల్, ఇందుమతి, అభినాష్, రాంచరణ్, నరేందర్ సింగ్, తంబళ్ల చరణ్ మొదవలైన వారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేస్‌రావు, డైరెక్టర్ సుమన్ మాట్లాడుతూ వైరా డివిజన్‌లోనే కాకుండా యావత్తు ఖమ్మం జిల్లా స్థాయిలోనే గొప్ప ఫలితాలు సాధించినందుకు గర్వంగం ఉందని మాట్లాడుతూ తెలిపినటువంటి విద్యార్థులు మా పాఠశాల నందు 6వ



తరతి నుండి 10వ తరగతి వరకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్స్‌లలో మేము ఇచ్చినటువంటి ఐఐటి ఫౌండేషన్‌ను అందుకొని ఈ రోజున ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచినందుకు మా విద్యాసంస్థలకు ఎంతో గర్వకారణం అన్నారు. న్యూరా వారి న్యూలిటిల్ ఫ్లవర్ మొదటి నుండి కూడా జాతీయస్థాయిలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించేటువంటి జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్, నీట్, ఈఏపిసెట్ లాంటి పోటీ పరీక్షల్లో మా విద్యార్థులకు తర్ఫీదును ఇవ్వడమే మా కర్తవ్యమే అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ పి.భూమేష్‌రావు, డైరెక్టర్ సుమన్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం.భువన ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆర్టిసి సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి మద్దతు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆర్టిసి కార్మికులు బుధవారం నుంచి తలపెట్టిన సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి ఖమ్మం జిల్లా కమిటీలు పూర్తి స్థాయి మద్దతు ప్రకటించాయి. ఆర్టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించకపోవడం వల్లే సమ్మె అనివార్యమైందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. ప్రభుత్వం ఆర్టిసి కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యం, సాచివేత ధోరణిని అవలంభించిందని అందుకే కార్మికులు సమ్మెకు దిగకతప్పలేదని సురేష్ తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి వెంటనే కార్మికులతో చర్చించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆర్టిసిలో విలీనం, పిఆర్‌సి చెల్లింపు తదితర సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం దిగి వచ్చేంత వరకు సమ్మెకు సిపిఐ, ఏఐటియుసి, ఇతర ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నాయని ఆర్టిసి కార్మికులతో కలిసి ఆందోళన కార్యక్రమంలో పాల్గొనాలని సిపిఐ, ఏఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. సమ్మెకు పూర్తి మద్దతు నిస్తున్నట్లు ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు తెలిపారు.

# ఉమ్మడి జిల్లాలో నేడు మంత్రి పొంగులేటి పర్యటన



**ప్రజాపక్షం/ ఖమ్మం :** రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఖమ్మంజిల్లాలో పర్యటించనున్నారు. పాలేరు, ఇల్లందు, కొత్తగూడెం నియోజక వర్గాల్లో ఆయన పర్యటిస్తారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఖమ్మం నగరంలోని పలు ప్రైవేటు కార్యక్రమాల్లో పొంగులేటి పాల్గొననున్నారు.


# గరికపాడులో నూతి జన్మదిన వేడుకలు




**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం గరికపాడులో సర్పంచ్ లక్కిరెడ్డి నాగలక్ష్మి, ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఐలూరు సత్యనారాయణ రెడ్డి, కోట ఆదాం, గోసు రాధాకృష్ణ, బిల్లర్ నర్సింహారావు, మాజీ ఎంపిటిసి శీలం ఆదినారాయణరెడ్డి, వార్డు మెంబర్స్ గోనపల్లి కొండ, నాయకులు పొట్టపల్లి శ్రీను, కోట ఏసు, పాపిరెడ్డి, నరేష్‌రెడ్డి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణుల గణాంకాలపై ఆగ్రహం

## -సర్వే వివరాలు సవరించాలంటూ విశ్వకర్మ నేతల డిమాండ్



**ప్రజాపక్షం/కారేపల్లి:** తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సామాజిక ఆర్థిక సర్వేలో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సామాజిక వర్గాన్ని విభజించి చూపడం పట్ల విశ్వకర్మ రాష్ట్ర నాయకులు తుమ్మోజు రామమూర్తి తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో జరిగిన విశ్వ కర్మ, విశ్వ బ్రాహ్మణ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసందర్భంగా మండల నాయకులు వేములూరి కోటాచారితో కలిసి రాముమూర్తి మాట్లాడుతూ బి సి బి గ్రూపులో సీరియల్ నంబర్ 21లో ఉన్న విశ్వబ్రాహ్మణ, విశ్వ కర్మ అనే చట్టబద్ధ కులనామాన్ని పక్కన పెట్టి వృత్తుల ఆధారంగా జనాభాను విభజించడం వెనుక ఉద్దేశ్యం ఏమిటని ప్రశ్నించారు. ఇది విశ్వకర్మల అస్తిత్వాన్ని దెబ్బతీసే చర్యగా పేర్కొన్నారు. భవిష్యత్తులో నిర్వహించే అన్ని గణనల్లో కులనామాలను మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేశారు. ఈ పోరాటం కేవలం గణాంకాల కోసం కాకుండా విశ్వకర్మల ఆత్మగౌరవం కోసం జరుగుతోందని, ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే నిర్వహించిన సర్వేను ఉపసంహరించుకుని విశ్వకర్మ పేరుతో కొత్తగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో విశ్వ కర్మ నాయకులు అద్దంకి వీరభద్రచారి, పోలోజు ఉపేంద్రచారి, తదితరులు పాల్గొన్నారు.

# ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమం ప్రశంస అవార్డులు




**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం ఎస్ఆర్ గార్డెన్స్ నందు జిల్లా విద్యాశాఖ అధికారిని చైతన్య జైని అధ్యక్షతన జరిగిన ఎవిరి చైల్డ్ రీడ్ ప్రశంస అవార్డుల కార్యక్రమం నందు వైరా సిపిఎస్ గుట్టబడి ప్రాథమిక పాఠశాలకు హైయెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డును జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌చేతుల మీదుగా గుట్టబడి పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆర్.శ్రీనివాసచారి, పెనుగొండ ఉపేందర్‌రావు తదితరులు అవార్డు అందుకోవడమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ మాట్లాడుతూ ఆరు నెలల్లో జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు ప్రత్యేక కార్యక్రమం ద్వారా ప్రతి పిల్లవాడు ఇంగ్లీష్ చదివే విధంగా చేపట్టిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రేత్యక శ్రద్ధతో ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులందరూ ఇంగ్లీష్ చదివే విధంగా కృషి చేసి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేక కృషి చేసి రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లాకు ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చే విధంగా పని చేశారని ఆయన తెలియజేశారు. రాబోయే సంవత్సరం కూడా ఇదే విధమైన పని తీరును కనబరిచి దేశంలోనే ఖమ్మం జిల్లా ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చే విధంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి కొత్తపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైరా మండలానికి గుట్టబడి ప్రాథమిక పాఠశాల ఎంపిపిఎస్ గర్ల్స్ , ఎంపియుపిఎస్ పుణ్యపురం, ఎంపిపిఎస్ పాలడుగు పాఠశాలలకు అవార్డులు వచ్చాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమలో అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీస్ శ్రీజ, సీఈవో దీక్షరైనా, డీఈవో చైతన్య జైని, కొత్తపల్లి వెంకటేశ్వర్లు, పెనుగొండ ఉపేంద్రరావు, ఆర్.శ్రీనివాసచారి, జి.వాసు, వి.శైలజ, కె.లక్ష్మీ , సూతకాని స్వప్యన, అఫ్జల్, సైదులు, పాఠశాలల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.